సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 11 । జూన్ । 2025



ప్రథమ వర్ధంతి



కీ॥ శే॥ శ్రీ చింతా పాండురంగారెడ్డి గారు

జననం : 18-06-1951

మరణం : 11-06-2024

వ్యవస్థాపకులు : శ్రీ మురళీ మోహన బాయిల్డ్ & రా రైస్‌మిల్ ప్రైవేట్ లిమిటెడ్

మీ విలువలనే గుండెల్లో అల్లుకొని, మీరు నింపిన ధైర్యమే ఊపిరిగా...
మీరు చూపిన పట్టుదలే ప్రాణంగా.. మీరు నేర్పిన ముందుచూపే స్ఫూర్తిగా...
మీ ఆచరణే మాకు ఆదర్శం.. మీ నడవడికే మాకు మార్గదర్శకం..
మీ విలువలే మాకు ఆశయం.. మీరు చూపిన బాటలోనే పయనిస్తూ...
మీరు శివైక్యం పొంది సంవత్సరకాలమైనా...
మీరు మాతో గడిపిన జ్ఞాపకాలను సదా స్మరించుకుంటూ... అంజలి ఘటిస్తూ...

కుటుంబసభ్యులు, బంధుమిత్రులు,
శ్రేయోభిలాషులు మరియు సిబ్బంది

శ్రీ మురళీ మోహన బాయిల్డ్ & రా రైస్‌మిల్ ప్రైవేట్ లిమిటెడ్

కొమరిపాలెం, బిక్కవోలు మండలం. తూర్పుగోదావరి జిల్లా. ఫోన్: 08857-235326, 235026

క్లుప్తంగా

జీజీయూలో ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

రాజానగరం: ఆస్ట్రేలియాలోని మెక్వైరీ యూనివర్సిటీ, ప్రముఖ సంస్థ కేపీఎంజీ ఇండియాలతో స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) అవగాహన ఒప్పందాలు చేసుకుంది. దీనికి సంబంధించిన పత్రాలను యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ప్రో.ఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, కేపీజీఎం ఇండియా ప్రతినిధి నారాయణ్ రామస్వామి సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలతో బోధన అందించేందుకు జీజీయూ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రో.ఛాన్సలర్ శశికిరణ్ వర్మ మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా బీటెక్‌లో సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్ చేసేందుకు అవకాశాలుంటాయన్నారు. కేపీజీఎం ఇండియా ప్రతినిధి నారాయణ్ రామస్వామి మాట్లాడుతూ, జీజీయూతో కలిసి పని చేయడం ద్వారా విద్యార్థులకు చక్కటి భవితను అందించే అవకాశం లభించిందన్నారు. మెక్వైరీ యూనివర్సిటీ సైబర్ స్కిల్ అకాడమీ సీఈఓ మాట్ బుష్‌బై ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కేపీఎంజీ ఇండియా ప్రతినిధులు మహవీర్, రాఘవన్ ఎస్., జీజీయూ సాంకేతిక సలహాదారు సుమంత్, వీసీ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీఐపీఆర్‌ఓగా లక్ష్మీనారాయణ


కలెక్టర్ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసిన డీఐపీఆర్‌ఓ లక్ష్మీనారాయణ

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): సమాచార, పౌర సంబంధాల అధికారి(డీఐపీఆర్‌ఓ)గా కె.లక్ష్మీనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతిని ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు జిల్లా కావలి మండలానికి చెందిన లక్ష్మీనారాయణ 2020 జనవరిలో ఏపీపీఎస్సీ ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో ఉప సమాచార ఈఈగా తొలిసారి బాధ్యతలు చేపట్టారు. జిల్లాల పునర్విభజన అనంతరం బదిలీపై అమలాపురంలో డీపీఆర్‌ఓగా నియమితులయ్యారు. ప్రస్తుతం భాగంగా రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. లక్ష్మీనారాయణకు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్‌ఓ టి.సీతారామమూర్తి, బదిలీపై వెళ్తున్న డీఐపీఆర్‌ఓ సీహెచ్ శ్రీనివాస్, తదితరులు అభినందనలు తెలిపారు.

అక్షరంపై కక్ష కట్టి..

'సత్యమేవ జయతే' హితోక్తిని మకుటంలో ధరించి.. ఆ మాటలను త్రికరణ శుద్ధిగా నమ్మి.. ప్రభుత్వ విధానాల్లోని దుర్నీతిని ఎండగడుతూ.. నిరంతరం జనపక్షం వహిస్తూ.. ప్రజలకు నిత్యసత్యాలను అందిస్తున్న 'సాక్షి' అక్షరంపై పాలకులు కక్ష కట్టారు. సాకు కోసం వేచి చూసి.. మూకదాడికి 'కూటమి' కట్టారు. అణగారిన ప్రజల మనస్సాక్షిగా నిలుస్తున్న పత్రిక కార్యాలయంపై తెగబడ్డారు. పత్రిక నేమ్‌బోర్డును బలవంతంగా పెకలించి, ధ్వంసం చేశారు. భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నించారు. ఆ మూకల బరితెగింపు చూసి అటుగా వెళ్తున్న సామాన్య ప్రజలు నివ్వెరపోయారు. చక్కటి పాలన అందించాలని అందలం ఎక్కిస్తే.. ఇలా అరాచకానికి పాల్పడటమేమిటంటూ నిర్ఘాంతపోయారు.

- నిజాలు చెబుతున్న 'సాక్షి'పై అక్కసు
- దాడికి 'కూటమి' కట్టారు
- రాజానగరంలోని పత్రికా కార్యాలయం వద్ద ఆందోళన
- మూకుమ్మడి దాడి
- అనపర్తి ఎమ్మెల్యే ఆధ్వర్యాన చెలరేగిపోయిన మూకలు
- సాక్షి నేమ్ బోర్డు పీకేసి.. పత్రికల దహనం
- అడ్డుకోబోయిన పోలీసులకు గాయాలు


కూటమి శ్రేణుల దుశ్చర్యతో దహనమవుతున్న సాక్షి దినపత్రికలు



సాక్షి కార్యాలయం ముందు బైఠాయించిన ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి శ్రేణులు

రాజానగరం: 'సాక్షి' టీవీలో ఇటీవల జరిగిన ఒక చర్చాగోష్టిలో అమరావతి మహిళలను కించపరిచేలా ఓ వ్యక్తి వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఆందోళనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఆ పార్టీతో కూటమిగా ఉన్న బీజేపీ, జనసేన శ్రేణులు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొని, సాక్షి కార్యాలయాలపై మూకుమ్మడి దాడులకు పాల్పడి, ఆస్తులకు నష్టం కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో రాజానగరంలోని సాక్షి ముద్రణా కార్యాలయం వద్ద కూడా కూటమి నేతలు ఆదివారం నుంచి ఆందోళనలు చేస్తున్నారు. మంగళవారం అవి మరింత పరాకాష్ఠకు చేరాయి. ఆందోళనకారుల దుర్మార్గ చర్యలను నిరోధించేందుకు ప్రయత్నించిన పోలీసులు కూడా గాయపడ్డారంటే వారి చేష్టలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఏం జరిగిందంటే..

రాజానగరం, అనపర్తి ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ (జనసేన), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(బీజేపీ)తో పాటు అనపర్తి టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, జనసేన పార్టీ సమన్వయకర్త రావాడ నాగుల ఆధ్వర్యాన రెండు నియోజకవర్గాల నుంచి ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు సాక్షి ముద్రణా కార్యాలయం వద్దకు భారీగా తరలివచ్చి, ఆందోళనకు దిగారు. ఉదయం 10.30 గంటల సమయంలో రాజానగరం ఎమ్మెల్యే తన అనుయాయులతో కలసి ఆందోళన చేపట్టారు. సాక్షి మీడియాకు, వైఎస్సార్ సీపీకి, పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కొద్దిసేపటికి తన వర్గీయులతో అక్కడకు చేరుకున్న అనపర్తి ఎమ్మెల్యే ఆ ఆందోళనను కొనసాగిస్తూ విధ్వంసం దిశగా నడిపించారు. కార్యాలయం ప్రధాన గేటు ముందు సాక్షి దిన పత్రికలను వేసి దహనం చేశారు. పోలీసులు వారించినప్పటికీ ఆందోళనకారులు ఆగలేదు.

దౌర్జన్యం

ఎమ్మెల్యే రామకృష్ణరెడ్డి ప్రోత్సాహంతో అనపర్తి నియోజకవర్గానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కొప్పవరం మాజీ సర్పంచ్ కర్రి వెంకట రామారెడ్డి మరింత రెచ్చిపోయారు. పార్టీ శ్రేణులను ఉసిగొల్పారు. దీంతో, అన్నవరం దేవస్థానం మాజీ డైరెక్టర్ సత్తి దేవానందరెడ్డి (బాబు), రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పుట్ట గంగాధర్ చౌదరి, టీడీపీ మహిళా అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి, ప్రధాన కార్యదర్శి సువాసిని, బిక్కవోలు యూత్ కమిటీ అధ్యక్షుడు పాలచర్ల వెంకట శివ ప్రసాద్ చౌదరితో పాటు కొంతమంది మహిళా కార్యకర్తలు కార్యాలయం ప్రహరీకి అమర్చి ఉన్న సాక్షి నేమ్ బోర్డును బలవంతంగా పెకలించారు. అడ్డుకోబోయిన పోలీసులను ఖాతరు చేయలేదు. ఈ క్రమంలో రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్సైలు నాగార్జున, నారాయణమ్మతో పాటు కొంతమంది పోలీసుల చేతులకు కూడా గాయాలయ్యాయి.


సాక్షి నేమ్‌బోర్డ్ పెకలిస్తున్న మహిళలు


ధ్వంసమైన సాక్షి నేమ్‌బోర్డ్

రక్షణ కల్పించండి


రాజానగరం సీఐ వీరయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాక్షి సిబ్బంది

సాక్షి ముద్రణా కార్యాలయంపై దాడి నేపథ్యంలో బ్రాంచి మేనేజర్ ఎస్.రమేష్‌రెడ్డి, సిబ్బంది కలసి సాయంత్రం సీఐ వీరయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ దాడి కారణంగా జరిగిన నష్టాన్ని వివరిస్తూనే, ఇవి ఏ స్థాయికి వెళ్తాయోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశాంత పరిస్థితులు నెలకొనేంత వరకూ కార్యాలయం వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, తాము విధులు సక్రమంగా నిర్వర్తించేలా రక్షణ కల్పించాలని కోరారు.

సాక్షి కార్యాలయాలపై దాడులు అమానుషం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఎస్పీకి జర్నలిస్టుల విజ్ఞప్తి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై అరాచక దాడులు చేస్తున్న టీడీపీ కుట్రపూరిత చర్యలపై జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు కదం తొక్కారు. రాజమహేంద్రవరం సాక్షి జర్నలిస్టులు, సాక్షి యూనిట్, ఇతర పాత్రికేయులు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. సాక్షి టీవీలో అమరావతి రాజధాని అంశంపై జరిగిన చర్చకు సంబంధించి టీడీపీ, ఆ పార్టీలోని కొందరు వ్యక్తులు సాక్షి కార్యాలయాలపై రాళ్ల దాడులు చేపట్టి, బెదిరింపులకు పాల్పడుతున్నారని, దీనికి కారకులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. టీడీపీ ఆదేశాలతోనే సాక్షి కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయని, ఆ పార్టీ అధిష్టానం కుట్రపూరితంగా తన శ్రేణులను రెచ్చగొట్టి సాక్షిపై దాడులకు ఉసిగొల్పుతోందని అన్నారు. గుంపులుగా చేరి దాడులు చేసిన వారిపై 143, 147, 427, 341, 506, 352 సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని కోరారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ వెంటనే సాక్షి కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీని కలిసిన వారిలో సాక్షి స్టాఫ్ రిపోర్టర్ ఫయాజ్ బాషా, సాక్షి టీవీ రిపోర్టర్ హరీష్, ఎన్‌టీవీ శ్రీను, సాక్షి జర్నలిస్టులు శేఖర్‌రెడ్డి, విశ్వనాథం, పీఎస్ గంగాధర్, టీవీ కెమెరామెన్ మురళి, సర్క్యులేషన్ మేనేజర్ రాంబాబు, ఎస్‌ఆర్ సురేష్‌కుమార్, యాడ్స్ ప్రతినిధి పి.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు తదితరులున్నారు.


ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న రాజమహేంద్రవరం జర్నలిస్టులు

విశ్వాసం నిలబెట్టుకోలేకపోయారు

- ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదు
- రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్షసాధింపు చర్యలు
- కూటమి ప్రభుత్వ పనితీరుపై విస్తృత చర్చ జరగాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు


విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత వేణు. చిత్రంలో తానేటి వనిత, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

దేవరపల్లి: రాష్ట్రంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోలేకపోయిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. నల్లజర్లలో పార్టీ మండల కార్యాలయం వద్ద ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో చట్టాలను అమలు చేయవలసిన వ్యవస్థలను ప్రభుత్వ పెద్దలు తమ గుప్పెట్లో పెట్టుకుని పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. చట్టాల్ని ఉల్లంఘించడానికే రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు మీడియాపై, మరోవైపు ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, అక్రమ కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. రైతులను ప్రభుత్వం నిలువునా ముంచిందని విమర్శించారు. పెట్టుబడి సాయం లేదని, పంటల బీమా సౌకర్యం లేక, గిట్టుబాటు ధరలు రాక రైతులు తీవ్ర నిరాశలో మునిగిపోయారని అన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో వ్యవసాయం భారంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం, కోకో, ఆయిల్‌పామ్, పొగాకు వంటి పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉండి, సమస్యల పరిష్కారానికి పోరాడుతుందని చెప్పారు. రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్‌గా మారడంతో ముక్కుపచ్చలారని చిన్నారులు, యువతులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని వేణు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మహిళలపై 185 అత్యాచారాలు జరగగా, వీటిలో 27 హత్యలు జరిగాయని తెలిపారు. తల్లికి వందనం సాయం అందించకుండా పేద విద్యార్థుల చదువులకు ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందన్నారు. విద్యారంగాన్ని విధ్వంసం చేశారన్నారు. ఇటువంటి ప్రజా సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పాలకులందరూ బంజరు భూములను సాగులోకి తెచ్చి పంట భూములుగా మార్చగా, సీఎం చంద్రబాబు పట్టుదలకు పోయి మూడు పంటలు పండే భూముల్లో అమరావతి నిర్మాణం చేపట్టారని విమర్శించారు. అమరావతి భూములను వ్యాపార భూములుగా మార్చారని అన్నారు. ఇటువంటి పరిణామాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వ పని తీరుపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని వేణు అన్నారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత, రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రమణ్యం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బంకా అప్పారావు పాల్గొన్నారు.

సముద్ర స్నానానికి వెళ్లిన యువకుడి మృతి

గల్లంతైన మరొకరి కోసం గాలింపు


హరికిషోర్ (ఫైల్)


ఎస్.యానంలో హరి కిషోర్ మృతదేహాన్ని వెలికి తీసిన ఎస్సై రాజేష్, సిబ్బంది

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఉన్న బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగి ఇద్దరు యువకులు గల్లంతుకాగా అందులో ఒకరు మృతిచెందారు. మంగళవారం సాయంత్రం అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన యాళ్ళ హరికిషోర్(19), అయినవిల్లి మండలం నేదునూరుకి చెందిన ఇసుకపట్ల జస్వంత్(19), మరో ముగ్గురు నేదునూరుకు చెందిన యువకులు ఎస్.యానం బీచ్‌కు వచ్చి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. వీరు ఐదుగురు స్నేహితులు. సముద్రంలో స్నానానికి దిగిన ఐదుగురు యువకుల్లో హరికిషోర్, జస్వంత్ సముద్రంలో మునిగిపోయారు. గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా హరికిషోర్ మృతదేహం లభ్యమయిందని, జస్వంత్ కోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్.రాజేష్ తెలిపారు.

కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్నాం...

అంబాజీపేట: మృతిచెందిన యాళ్ల హరికిషోర్ ఓ ప్రైవేటు కంపెనీలో రికవరీ ఏజెంటుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని మృతితో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న నేపథ్యంలో ఇప్పుడు దిక్కెవరని బంధువులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. వీరి స్వగ్రామం పి.గన్నవరం కాగా మృతుడి తండ్రి కుమార్ ఎస్.యానం ఓఎన్‌జీసీలో పనిచేస్తున్నారు. తల్లి నాగమణి, అతని సోదరి మాచవరం కుసుమవారిపేటలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. అందరితో సరదాగా ఉండే హరికిషోర్ ఇక లేడని తెలియడంతో కుసుమవారిపేటలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. హరికిషోర్ అందరితో కలిసి ఉండేవాడని అతని మరణం జీర్ణించుకోలేకపోతున్నామని కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది.

అఘాయిత్యాలపై స్పందించరేం..?

- డైవర్షన్ రాజకీయాలకు తెర లేపుతారా?
- హోం మంత్రి అనితపై మాజీ హోం మంత్రి వనిత విమర్శ


విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, బాలికలు, యువతులు, మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు ఎక్కువగా జరుగుతున్నప్పటికీ హోం మంత్రి వంగలపూడి అనిత కనీసం స్పందించిన దాఖలాల్లేవని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత విమర్శించారు. నల్లజర్లలో పార్టీ మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద ఆమె విలేకర్లతో మాట్లాడారు. అనంతపురం జిల్లాలో ఇంటర్ విద్యార్థిని తన్మయి కనిపించడం లేదని తల్లిదండ్రులు ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వారం రోజులు గడిచినా పోలీసులు స్పందించలేదన్నారు. నాడు అదృశ్యమైన తన్మయి ఆదివారం శవమై కనిపించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఆమె గురించి హోం మంత్రి అనిత ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమని విమర్శించారు. ఇన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోకుండా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో బాలికపై టీడీపీ కార్యకర్త అత్యాచార యత్నానికి ఒడిగట్టాడని, బాధితురాలికి ప్రభుత్వం తరఫున ఇంతవరకూ సాయం అందించలేదని వనిత ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో ఒక యువతిని ఆరు నెలలుగా ఏడుగురు యువకులు ఇంట్లో బంధించి లైంగిక దాడికి పాల్పడినా, విషయం పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లినా కేసు నమోదు చేయని విషయం అనితకు కనిపించడం లేదని మండిపడ్డారు. ఎంతసేపూ వైఎస్ జగన్‌ను, భారతిని తిట్టడం తప్ప వేరే పని లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి అనిత పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. వీటిపై ఎవరైనా మాట్లాడితే తప్పుడు కేసులు బనాయించి, జైల్లో పెడుతున్నారన్నారు. జర్నలిస్టు కృష్ణంరాజు మహిళలపై చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ, మహిళల తరఫున ఖండిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ వాటిని తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, భారతికి ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి గురించి వంగలపూడి అనిత ఎన్నో అన్నారని, అలా మాట్లాడాలని చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి, లోకేష్ చెప్పారా అని వనిత ప్రశ్నించారు. కొమ్మినేని, కృష్ణంరాజు వ్యాఖ్యల గురించి వైఎస్ జగన్ క్షమాపణ చెప్పాలని అనిత అంటున్నారని, విజయమ్మ, భారతి గురించి మాట్లాడిన మాటలపై ముందు ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చిన్నారులు, యువతులు, మహిళల పట్ల జరుగుతున్న అత్యాచారాలకు అడ్డుకట్ట వేసి, బాధితులకు అండగా నిలబడాలని సూచించారు. బాధితులను పరామర్శించడం లేదని, ప్రభుత్వం నుంచి కనీస సాయం అందించడం లేదని, డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపుతూ వైఎస్ జగన్, సాక్షి చానల్, చానల్ అధినేత భారతి గురించి తప్పుడుగా మాట్లాడటమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. జగన్ గురించి అనితకు ఏం తెలుసని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో మహిళలకు జగన్ ఇచ్చినంత గౌరవం ఏ సీఎం ఇవ్వలేదన్నారు. మహిళలంతా మహరాణులుగా ఉండాలని అమ్మ ఒడి, చేయూత, ఆసరా, ఇళ్ల స్థలాలు, ఇళ్లు వంటి 11 పథకాలను మహిళల పేరిట అందించారని గుర్తు చేశారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకు ఇచ్చారని వనిత చెప్పారు. జగన్ గురించి మాట్లాడే అర్హత మంత్రి అనితకు లేదని అన్నారు. విలేకర్ల సమావేశంలో పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు యజ్ఞవరపు లక్ష్మి, నియోజకవర్గ కార్మిక విభాగం అధ్యక్షుడు మద్దూరి నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బంకా అప్పారావు, మేన్నీ కృష్ణ చౌదరి పాల్గొన్నారు.

కూటమి పాలనలో అతివలకు రక్షణ కరవు

- అత్యాచార ఘటనల్లో తక్షణ చర్యల్లేవు
- మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించాలి
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన నిరసన


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మార్తి లక్ష్మి, మేడపాటి షర్మిలారెడ్డి, పోలు విజయలక్ష్మి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వ పాలనలో స్త్రీలకు, బాలికలకు రక్షణ కరువైందని పలువురు మహిళలు ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి ఆధ్వర్యాన పెద్ద సంఖ్యలో మహిళలు రాజమహేంద్రవరంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. మహిళలపై దాడులు అరికట్టాలని, వైఎస్ భారతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద నిరసన తెలిపి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ, మహిళలకు రక్షణ అని సీఎం చంద్రబాబు చెప్పడమే తప్ప వారికి రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. మహిళలపై అత్యాచారాలు జరుగుతూంటే సాటి మహిళ అయిన హోం మంత్రి కనీసంగా కూడా స్పందించకపోవడం దారుణమని అన్నారు. అత్యాచారాలకు గురైన మహిళల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. మహిళలకు న్యాయం చేస్తామన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా వారి రక్షణ గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, మహిళలపై అత్యాచారాలకు ఒడిగడుతున్నవారిని అరెస్ట్ చేయాలని, భవిష్యత్తులో మహిళలపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సాక్షి చానల్‌లో జరిగిన డిబేట్‌లో ఒక తప్పు మాట దొర్లిందని ఆ పత్రిక కార్యాలయాల వద్ద ఆందోళన చేయడం, భారతిని, జగన్‌ను నిందించడం సరైన విధానం కాదని అన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా హామీలు అమలు చేయకపోవడంతో వెన్నుపోటు దినం పేరిట వైఎస్సార్ సీపీ ఆందోళన చేయడాన్ని జీర్ణించుకోలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపారని ధ్వజమెత్తారు. సాక్షి చానల్‌లో జరిగిన డిబేట్‌లో దొర్లిన తప్పునకు సంబంధిత వ్యక్తులు క్షమాపణ చెప్పినప్పటికీ, సంబంధం లేని భారతిని దూషిస్తూ రాద్ధాంతం చేయడంలో ఉద్దేశమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన మహిళా అధ్యక్షులు పోలు విజయలక్ష్మి, ఇమంది విజయకుమారి, దాకారపు బంగారమ్మ, ముప్పిడి దమయంతి, అంగాడ సత్యప్రియ, చీరాల ఉమాదేవి, గాండ్ల, తెలుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సంకిస భవానీప్రియ తదితరులు పాల్గొన్నారు.